సమాచారం

ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రిలో మహిళలకు ప్రత్యేక వైద్యశిబిరం

అమీర్‌పేట: ప్రపంచ మహిళా దినోత్సవం సందర్భంగా అమీర్‌పేట ఆస్టర్ ప్రైమ్ ఆసుపత్రి ఆధ్వర్యంలో మహిళల ఆరోగ్య పేరి పరక్షణకు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆసుపత్రి అధికారులు తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమాల్లో భాగంగా మార్చి 8 నుంచి 31 వరకు మహిళల కోసం ప్రత్యేకంగా ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేశామన్నారు. గైనకాలజీ కన్సల్టేషన్‌తో పాటు వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేస్తారన్నారు. సేవలను వినియోగించుకోదలచిన వారు అమీర్‌పేటలోని ఆసుపత్రి లేదా 9010100536 ఫోన్ నెంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

బీఆర్‌జేసీ విద్యార్థికి రన్నింగ్‌లో మొదటి బహుమతి


కిషన్‌రెడ్డి చేతుల మీదుగా చెక్కు అందుకుంటున్న వెంకటేష్

రాంగోపాల్‌పేట్: ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో 'ఖేలో సికింద్రాబాద్ జీతో సికింద్రాబాద్' పేరుతో నిర్వహించిన పరుగు పందెలో సికింద్రాబాద్ పార్క్‌లేన్‌లోని బీఆర్‌జేసీ పాఠశాలకు చెందిన విద్యార్థి మొదటి బహుమతి దక్కించుకున్నాడు. దోమల్‌గూడలోని ఏవీ కళాశాలలో జరిగిన 800 మీటర్ల పరుగు పందెలో పాఠశాలకు చెందిన 10వ తరగతి విద్యార్థి ఎం వెంకటేష్ మొదటి స్థానంలో నిలిచాడు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి చేతుల మీదుగా విజేతకు పతకంతో పాటు రూ.5వేల చెక్కు అందజేశారు. విద్యార్థులు క్రీడల్లోనూ రాణించి ప్రపంచంలో దేశ ప్రతిష్టలు ఇనుమడింప చేయాలని కిషన్‌రెడ్డి సూచించారు. పాఠశాల ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్ తదితరులు విద్యార్థిని అభినందించారు.

పౌర్ణమి సందర్భంగా అన్నదానం



రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు 8వ వార్డు బొల్లారం డౌటన్‌బజార్‌లోని శ్రీ భూలక్ష్మమ్మ దేవాలయం కమిటీ నిర్వాహకుల ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమం జరిగింది. ఉదయం ఆలయంలో అమ్మవారికి అభిషేకం, కుంకుమ పూజ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ నాయకులు అర్వింద్, టీపీసీసీ ఎస్సీ సెల్ నగర ప్రధాన కార్యదర్శి నర్సింహ్మన్ కన్నన్, పూర్ణచందర్, శ్యాం. యాదగిరి, బాలకృష్ణ, దత్తు, శివ, రాజేష్, సుభాష్, అంథోని తదితరులు పాల్గొన్నారు.

'దేవాలయ రక్షణకు సంఘటితం కావాలి'

కాచిగూడ: దేశ వ్యాప్తంగా దేవాలయాల రక్షణకు హిందూవులందరూ సంఘటితంగా ఉద్యమం చేయాలని హిందూ జన జాగృతి సమితి రాష్ట్ర కో–ఆర్డినేటర్ చేతన్‌గాడి పిలుపునిచ్చారు. హిందూ జన జాగృతి సమితి ఆధ్వర్యంలో 'ప్రభుత్వం ఆధీనంలో ఉన్న మందిరాల విషయంలో పక్షపాత ధోరణి ఎందుకు'.. ? అనే అంశంపై మంగళవారం ఆన్‌లైన్‌లో నిర్వహించిన సమావేశంలో పలువురు వక్తలు పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా మంగళ్ గ్రహో సేవా సంస్థ అధ్యక్షుడు దిగంబర్ మహాలే, ఆనంద్ జఖోటియా తదితరులు మాట్లాడారు. భక్తులు వివిధ ఇబ్బందుల నుంచి ఉపశమనం పొందేందుకు ఆలయానికి వస్తారని ఆలయానికి వచ్చే భక్తుల విశ్వాసాన్ని డబ్బుతో తూకం వేసే ఆలయ నిర్వాహకుల వల్ల భక్తులు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇతర వర్గాల వారు మాత్రం తమ ప్రార్థనా స్థలాల పనులను స్వయంగా నిర్వహించుకుంటున్నారని ఇది హిందువులకు జరుగుతున్న అన్యాయమన్నారు. దేశ వ్యాప్తంగా ప్రభుత్వ ఆధీనంలో ఉన్న అనేక దేవాలయాల్లో పెద్ద ఎత్తున అవినీతి జరగడమే కాకుండా హిందువుల మత సంప్రదాయాలపై దాడులు జరుగుతున్నాయన్నారు. హిందూ భక్తులు, ఆలయ సందర్శకులు, హిందూ సంస్థలు సమిష్టిగా పనిచేసినప్పుడే దేవాలయాల్లో జరిగే ఇలాంటి తప్పుడు వ్యవహారాలను అరికట్టడం సాధ్యమవుతుందన్నారు.

వాల్మీకుల అభ్యున్నతికి చర్యలు తీసుకోవాలి

లిబర్టీ: అన్ని రంగాల్లో వెనుకబడి ఉన్న వాల్మీకుల అభ్యున్నతికి కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని వాల్మీకి సేవా సంఘం అధ్యక్షుడు డి.ప్రీతంసింగ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ, బీజేపీ ప్రభుత్వం తన 8 ఏళ్ల పాలనలో ఇప్పటి వరకు దేశంలో ఉన్న లక్షలాది మంది వాల్మీకుల కోసం ఒక్క రూపాయి కూడా కేటాయించలేదన్నారు. 2023–24 వార్షిక బడ్జెట్‌ను 45 లక్షల కోట్లతో కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంటులో ప్రవేశపెట్టారు తప్ప వాల్మీకుల ఆర్థిక, సామాజికాభివృద్ధి కోసం ఒక్క పథకాన్ని కూడా ప్రవేశపెట్టలేదని విమర్శించారు. ఇప్పటికైనా కేంద్రం వాల్మీకుల అభివృద్ధికి అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు.

హోలీ..రంగుల కేళీ..

హోలీ వేడుకలను సికింద్రాబాద్, కంటోన్మెంట్, సనత్‌నగర్ డివిజన్లలో ప్రజలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఎస్‌ఆర్‌నగర్‌లోని ప్రైవేట్ హాస్టళ్లలో ఉండే యువతీ, యువకులు తీన్మార్ పాటలకు స్టెప్పులు వేస్తూ ఉత్సాహంగా గడిపారు. మోండా మార్కెట్ కార్పొరేటర్ కొంతం దీపిక మంగళవారం వెస్ట్‌మారేడ్‌పల్లిలోని కిబూ కిడ్స్ ప్లే స్కూల్‌లో చిన్నారుల మధ్య హోలీ వేడుకలు జరుపుకున్నారు. చిన్నారులతో కలిసి ఆర్గానిక్ రంగులు చల్లుతూ సందడి చేశారు. తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయం వద్ద జీహెచ్‌ఎంసీ పారిశుద్ధ్య కార్మికులతో కలిసి డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి, బీఆర్‌ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. మాజీ మేయర్, బండ కార్తీకరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు బండ చంద్రారెడ్డి బంజారా మహిళలు, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి నృత్యాలు చేశారు. –సాక్షి, జోన్ బృందం


పారిశుద్ధ్య కార్మికులతో కలిసి హోలీ వేడుకల్లో పాల్గొన్న డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్‌రెడ్డి


చిన్నారుల మధ్య హోలీ వేడుకలు జరుపుకుంటున్న కార్పొరేటర్ దీపిక


వైష్ణవీ సన్‌రైజ్ అపార్ట్‌మెంట్‌లో..


హోలీ వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ కంది శైలజ

మనవడితో హోలీ ఆడిన మంత్రి తలసాని



అమీర్‌పేట: ప్రజా జీవితంలో ఎప్పుడు బిజీగా ఉండే రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ హోలీ వేడుకలు జరుపుకున్నారు. మంగళవారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన నివాసంలో మనవడు తలసాని తారక్‌తో కలిసి హోలీ ఆడారు. తాతా మనువడు ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ సంతోషంగా గడిపారు. కుటుంబ సభ్యుల మధ్య హోలీ వేడుకలు జరుపుకోవడం ఆనందంగా ఉందన్న మంత్రి రాష్ట్ర ప్రజలకు హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.




హోలీ వేడుకల్లో మాజీ మేయర్ బండ కార్తీకరెడ్డి


హోలీ వేడుకల్లో పాల్గొన్న మార్కెట్ మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్


పారిశుద్ధ్య కార్మికులతో హోలీ ఆడుతున్న జక్కుల మహేశ్వర్‌రెడ్డి

అక్రమ పార్కింగ్‌కు చెక్

సాక్షి ఎఫెక్ట్..


అక్రమ పార్కింగ్‌పై చర్యలు తీసుకున్న ట్రాఫిక్ పోలీసులు

లాలాపేట: తార్నాక చౌరస్తాలోని ఓ హోటల్ ఎదుట నో పార్కింగ్ ప్రాంతంలో అధిక సంఖ్యలో వాహనాలను పార్క్ చేస్తుండటంతో రాకపోకలు స్తంభించి వాహనదారులు ఇబ్బందులు పడుతున్న వైనాన్ని ' ఈ నెల 6న సాక్షి దినపత్రికలో ' అక్రమ పార్కింగ్...పట్టించుకోరేం'.. శీర్షికన ప్రచురితమైన కథనంపై నల్లకుంట ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. సోమవారం రాత్రి ఆ ప్రాంతంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. హోటల్ ఎదుట రోడ్లపై పార్క్ చేసిన వాహనాలను ఠానాకు తరలించారు. పలువురు వాహనదారులకు చలాన్లు విధించారు. నో పార్కింగ్ అని నోటీసు ఉన్నప్పటికీ దాన్ని ఖాతరు చేయకుండా హోటల్ ముందు అక్రమంగా పార్కింగ్ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హోటల్ నిర్వాహకులను హెచ్చరించారు. తార్నాక చౌరస్తాలో ట్రాఫిక్ జాం సమస్యను వెలుగులోకి తీసుకువచ్చిన 'సాక్షి' దినపత్రికకు స్థానికులు, పలువురు వాహనదారులు కృతజ్ఞతలు తెలిపారు.

మహంకాళి దేవాలయంలో చండీ హోమం


హోమంలో పాల్గొన్న భక్తులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి అమ్మవారి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా మంగళవారం చండీహోమం నిర్వహించారు. ప్రతి పౌర్ణమి సందర్భంగా మహంకాళి దేవాలయంలో హోమాన్ని నిర్వహిస్తామని ఈఓ గుత్తా మనోహర్‌రెడ్డి తెలిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు హోమంలో పాల్గొన్నారు.

ఘనంగా శ్రీ గౌర పూర్ణిమ

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని హరేకృష్ణ గోల్డెన్ టెంపుల్‌లో శ్రీ గౌర పూర్ణిమ పండుగను మంగళవారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుడి అవతారంగా కొలిచే శ్రీ చైతన్య మహాప్రభు జయంతి సందర్భంగా ఈ వేడుకలు నిర్వహిస్తుంటారు. దీనిలో భాగంగా 56 రకాలైన వంటకాలతో ఛప్పన్ భోగ్ పేరుతో నైవేద్యం సమర్పించారు. అనంతరం శ్రీ నితాయ్ గౌరంగ్ అష్టోత్తరశత కలశ మహాభిషేకం, మహా పల్లకీ ఉత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు కీర్తనలు, భజనలు, నృత్యాలతో సందడి చేశారు.



క్రమశిక్షణ, పట్టుదలతోనే ఉన్నత స్థానం


యండమూరిని సన్మానిస్తున్న నిర్వాహకులు

రాంగోపాల్‌పేట్: విద్యార్థులు క్రమ శిక్షణ, పట్టుదలతో కష్టపడి చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ అన్నారు. మంగళవారం సన్నిహిత హోం ఆధ్వర్యంలో హోటల్ పార్క్‌లేన్‌లో అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన యండమూరి మాట్లాడుతూ మనిషి విజ్ఞానానికి క్రమ శిక్షణ, పట్టుదల తోడైతే విజయం మీ సొంతం అవుతుందన్నారు. విద్యార్థులు సినిమాలు, సోషల్ మీడియా జోలికి వెళ్లకుండా చదువుకు ప్రాధాన్యతనివ్వాలన్నారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు 'ప్రెసెన్స్ ఆఫ్ మైండ్' అంశంపై పరీక్ష నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థినులు తమ అవసరాలు, తాము పడిన కష్టాలు, జీవితంలో ఏ విధంగా ఉన్నత స్థాయికి చేరుకోవాలని అనుకుంటున్నారో వివరించారు. ప్రముఖ సైకాలజిస్టు మేరీ జోన్ విద్యార్థినులకు మానసిక అంశాలపై అవగాహన కల్పించారు. సీనియర్ పబ్లిక్ హెల్త్ ఆఫీసర్ రాజశ్రీ విద్యార్థినులకు ఆరోగ్యంపై జాగ్రత్తలు, సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది శారద, సన్నిహిత డైరెక్టర్ ఉషారాణి, ఉపాధ్యక్షురాలు కిరణ్మయి, సీడబ్లూసీ మాజీ చైర్‌పర్సన్ శ్యామల తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఐఎస్‌ఓ కళాశాల వార్షికోత్సవం


అతిథులను సన్మానిస్తున్న విద్యార్థులు

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ పరిధిలోని తార్నాక ఐఎస్‌ఓ ఇంటర్, డిగ్రీ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం వర్సిటీ క్యాంపస్‌లోని మోకాస్టార్ ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమానికి విద్యా సంస్థల డీన్ మనోహర్ అధ్యక్షత వహించగా డైరెక్టర్ వినోద వెంకటస్వామి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన స్పోర్ట్స్ డే క్రీడా పోటీల విజేతలకు బహుమతులు అందశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాళ్లు చక్రపాణి, ప్రదీప్, పద్మ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల నృత్య ప్రదర్శనలు అలరించాయి.

అందరికీ సంక్షేమ పథకాలు అందిస్తా


ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రంగా రవీందర్ గుప్తా

రసూల్‌పురా: కంటోన్మెంట్ బోర్డు 7వ వార్డు నుంచి బీఆర్‌ఎస్ పార్టీ మద్దతుతో తాను ఎన్నికల్లో పోటీ చేస్తున్నట్లు తెలంగాణ ఉద్యమకారుడు రంగా రవీందర్ గుప్త అన్నారు. మంగళవారం వార్డు పరిధిలోని లాలామియా బస్తీలో ఆయన ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పదవిలో లేకున్నా దివంగత ఎమ్మెల్యే జి. సాయన్న, మల్కాజ్‌గిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పేద ప్రజలకు అందేలా కృషి చేశానన్నారు. కార్యక్రమంలో సంగీతా యాదవ్, నాగరాజు, లావణ్, నరేందర్. చరణ్, దయాకర్ రావు, పాల్గొన్నారు.

క్రైస్తవ శ్మశానవాటికకు స్థలం కేటాయించాలని వినతి


కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

నల్లకుంట: క్రైస్తవుల శ్మశానవాటికకు మూసీ పరీవాహక ప్రాంతంలో స్థలం కేటాయించేందుకు చొరవ తీసుకోవాలని అంబర్‌పేట నియోజకవర్గం పాస్టర్స్ అసోసియేషన్ ప్రతినిధులు కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని కోరారు. ఈ మేరకు బీజేపీ మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ ఐజాక్ రాజ్ ఆధ్వర్యంలో కేంద్రమంత్రిని కలిసిన వారు వినతిపత్రం అందజేశారు. అంబర్‌పేట్ మూసీ పరివాహక ప్రాంతంలోని డంపింగ్ యార్డు పక్కన రెండు ఎకరాల స్థలం కేటాయించాలని కేంద్ర మంత్రిని కోరగా దీనికి ఆయన సానుకూలంగా స్పందించారన్నారు. పాస్టర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి వరకుమార్, ఉపాధ్యక్షుడు వల్లభ, సంయుక్త కార్యదర్శి చంద్రమోహన్, రాజు తదితరులున్నారు.

స్త్రీ పురుష సమానత్వంపై లఘు చిత్ర ప్రదర్శన

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా టీపీఎస్‌కే ఆధ్వర్యంలో స్త్రీ, పురుష సమానత్వంపై లఘు చిత్రాన్ని ప్రదర్శించారు. ఈ సందర్భంగా మంగళవారం వివిధ రంగాల్లో పలువురు ప్రముఖ మహిళలను ఘనంగా సత్కరించారు. ఎస్‌వీకే ట్రస్ట్ కార్యదర్శి వినయ్‌కుమార్ మాట్లాడుతూ.. స్త్రీ, పురుష సమానత్వం అన్ని రంగాల్లో ఉండాల్సిన అవసరం ఉందన్నారు. ఈ లఘు చిత్రంలో మహిళా లోకానికి అద్భుతమైన సందేశం ఇచ్చిందన్నారు. సమాజంలో పాతుకుపోయిన అంతరాలను పాలకులు అనుసరిస్తున్న మహిళా వ్యతిరేక విధానాలను ఎండగట్టిన తీరు ప్రశంసనీయమన్నారు. భూపతివెంకటేశ్వర్లు, నాయకులు బీడీఎల్ సత్యనారాయణ, పి.మోహన్‌రామ్, దుర్గాప్రసాద్, విజయకుమార్, శరణ్య, స్రవంతి, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్..

కెమికల్ డ్రమ్ము పేలి యువకుడి మృతి

అమీర్‌పేట: పాత సామాన్లను ట్రాలీ ఆటోలో లోడ్ చేస్తుండగా కెమికల్ డ్రమ్ము పేలి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ముషీరాబాద్ భోలక్‌పూర్‌కు చెందిన మొహ్మద్ నజీర్ (30) స్క్రాప్ వ్యాపారం చేసేవాడు. సోమవారం సాయంత్రం ముసాపేట హెచ్‌పీ రోడ్డులోని ఓ గోడౌన్‌లో నుంచి కెమికల్ డ్రమ్ములను టాటా ఏస్ వాహనంలో లోడింగ్ చేస్తుండగా ఓ డ్రమ్ము ఆటోలో నుంచి కిందపడి పేలిపోవడంతో నజీర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. అతడిని గాంధీ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ సోమవారం రాత్రి మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

భార్యాభర్తల వివాదాల్లోకి మా కూతుర్ని లాగుతున్నారు.

- పోలీసులకు బాలిక తండ్రి ఫిర్యాదు

అమీర్‌పేట: భార్య, భర్తల మధ్య నెలకొన్న వివాదాల్లోకి అనవసరంగా తమ కూతుర్ని లాగుతున్నారని బాలిక తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాలికపై సోషల్ మీడియాలో పోస్టింగ్‌లు పెట్టిన మహిళపై ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. బోరబండ సైట్–త్రీ ఎస్‌ఆర్‌ఆర్ పురం ప్రాంతానికి చెందిన చెందిన మొహ్మద్ రియాజుద్దీన్ కుమార్తె (14) స్థానిక పెన్ పవర్ లర్నింగ్ ఇనిస్టిట్యూట్‌లో చదువుకుంటోంది. అయితే సదరు ఇనిస్టిట్యూట్ ప్రిన్సిపాల్ షేక్ బషీర్ అతడి భార్య ఆత్ర మధ్య గొడవలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో ఆత్ర తన భర్తపై కోపంతో రెండేళ్ల క్రితం తీసిన బాలిక వీడియోలను సామాజిక మాధ్యమాల్లో పోస్ట్ చేసి తనను బ్లాక్ మెయిలింగ్ చేస్తుందని బాలిక తండ్రి రియాజ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ సైదులు తెలిపారు.

ఇద్దరు కుమార్తెలతో తండ్రి అదృశ్యం


శ్రీనివాస్ (ఫైల్)

నల్లకుంట: బార్యాభర్తల మధ్య జరిగిన గొడవతో తల్లి ఇద్దరు పిల్లలను వదిలి పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన భర్త ఇద్దరు కుమార్తెలను తీసుకుని అదృశ్యమైన ఘటన నల్లకుంట పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై కాశయ్య తెలిపిన వివరాల ప్రకారం.. జీహెచ్‌ఎంసీ ఉద్యోగి శ్రీనివాస్ (36) భార్య భవాని ఇద్దరు కుమార్తెలు సాయి సహస్ర (4), రెండున్నరేళ్ల యస్వితతో కలిసి నల్లకుంట నర్సింహ బస్తీలో నివాసం ఉంటున్నారు. కాగా.. ఈనెల 4 న బార్యాభర్తల మధ్య ఘర్షణ జరిగింది. సహనం కోల్పోయిన శ్రీనివాస్ బార్యపై చేయి చేసుకున్నాడు. దీంతో పిల్లలను వదిలేసి అల్వాల్‌లో ఉన్న సోదరుడి ఇంటికి వెళ్లిపోయింది. 5వ తేదీన తిరిగి ఇంటికి చేరుకోగా.. ఇంట్లో భర్త ఇద్దరు పిల్లలు కనిపించలేదు. భర్త, పిల్లల ఆచూకీ కోసం ప్రయత్నించినా ఫలితం లేకపోవడంతో సోమవారం సాయంత్రం నల్లకుంట పోలీసులకు ఫిర్యాదు చేసింది. పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి


లాల్‌బజార్‌లో మహిళా దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న శ్రీ గణేష్

రసూల్‌పురా: ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు, విద్యార్థినులు ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగాలని శ్రీ గణేష్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు శ్రీ గణేష్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం గాంధీనగర్, లాల్‌బజార్, బొల్లారం రిసాలబజార్‌లో వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మహిళలతో కలిసి కేక్ కట్ చేశారు. క్రీడా పోటీల్లో విజేతలుగా నిలిచిన మహిళలకు బహుమతులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అన్నింటా సగం అయిన మహిళల కోసం ఎన్ని చట్టాలు వచ్చినా వారిపై అఘాయిత్యాలు తగ్గడం లేదన్నారు. మహిళా దినోత్సవం సందర్భంగా కంటోన్మెంట్ నియోజకవర్గ పరిధిలో పలు కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు. వివిధ క్రీడా పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశామన్నారు. కార్యక్రమంలో వినీత, చోటు. శరత్, మహేష్, లక్ష్మి, మహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మహిళాభ్యున్నతికి పెద్దపీట


మాట్లాడుతున్న మోతే శ్రీలతశోభన్‌రెడ్డి

లాలాపేట: గ్రేటర్ హైదరాబాద్‌లో మేయర్‌గా, డిప్యూటీ మేయర్‌గా మహిళలకే అవకాశం కల్పించి ముఖ్యమంత్రి కేసీఆర్ విశ్వనగరంలో మహిళల ఆత్మగౌరవాన్ని మరింత పెంచారని డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి అన్నారు. మంగళవారం తార్నాకలోని డిప్యూటీ మేయర్ క్యాంప్ కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళలకు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి పెద్దపీట వేసిందన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు అవకాశాలు కల్పించడంతో పాటు మహిళల భద్రతకు ప్రత్యేక చర్యలు తీసుకుంటుందన్నారు. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం డ్వాక్రా రుణాలు, కల్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, గర్భిణీలు,, బాలింతలకు ప్రోత్సాహకాలు, కేసీఆర్ కిట్ సహా దేశంలో ఎక్కడా లేనన్ని సంక్షేమ పథకాలను అమలు చేస్తున్న ఘనత ముఖ్యమంత్రికి దక్కుతుందన్నారు. తాజాగా ఆరోగ్య మహిళా కార్యక్రమానికి తెలంగాణ సర్కారు శ్రీకారం చుట్టిందన్నారు. రాష్ట్రంలోని మహిళలందరూ ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని అభివృద్ధి సాధించాలని కోరారు.

మహిళలకు తగిన అవకాశాలు కల్పించాలి


బహుమతులు అందజేస్తున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: మహిళలకు తగిన అవకాశాలు కల్పిస్తే అద్భుతాలు సృష్టిస్తారని బీఆర్‌ఎస్ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం 5వ వార్డు బీఆర్‌ఎస్ మహిళా నాయకురాలు పెద్దాల శారదా నర్సింహ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వార్డు పరిధిలోని మహిళలకు నిర్వహించిన ఆటలు, పాటల పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి మర్రి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి, పార్టీ నేతలు పెద్దాల నర్సింహ, ముప్పిడి మధుకర్, పెద్ద సంఖ్యలో స్థానిక మహిళలు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ దిబ్బలుగా ఖాళీ స్థలాలు

- పర్యావరణానికి విఘాతంగా మారుతున్నాయని ఆవేదన
- జీహెచ్‌ఎంసీకి ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వినతి



సుందరయ్య విజ్ఞాన కేంద్రం: నగరంలో వేల సంఖ్యలో ఉన్న ఖాళీ స్థలాలు ప్లాస్టిక్ దిబ్బలుగా మారి పర్యావరణానికి తీవ్ర నష్టం కలిగిస్తున్నాయని, ప్లాస్టిక్‌తో పాటు చెత్త పేరుకుపోయి దుర్గంధం వెలువడుతూ.. గాలి కాలుష్యం, భూ కలుషితానికి కారణమవుతోందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ సంస్థ ఆందోళన వ్యక్తం చేసింది. ఈ చెత్త దిబ్బలు తొలగించకపోతే వచ్చే వర్షాకాలంలో భూగర్భ జలాలు కలుషితం కావడంతో పాటు ప్రజలు రోగాల బారిన పడతారని హెచ్చరించారు.

- స్థలాలు కోర్టు వివాదాల్లో ఉండటం వల్ల ఇరు వర్గాలు వాటి నిర్వహణను పట్టించుకోవడం లేదని దీనివల్ల దుర్వాసన, దోమలు, ఈగలు పెట్రేగిపోతున్నాయని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ అండ్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎస్.హెచ్.రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు.
- పారిశుద్ధ్య కార్మికులు కూడా ఆయా స్థలాల వైపు చూడటం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. పరిసరాల పరిశుభ్రత, పరిరక్షణ దారి తప్పుతోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.
- 'స్వచ్ఛ హైదరాబాద్, స్వచ్ఛ భారత్ లాంటి కార్యక్రమాలకు ఈ కాలుష్య కాసార ఖాళీ స్థలాలు కనిపించడం లేదా'..? అని రంగయ్య అధికారులను ప్రశ్నించారు. స్థల యాజమానుల ఉదాసీనత స్థానికులను రోగాల పాలు చేయడం బాధకరమన్నారు.
- ప్రభుత్వాలు యుద్ధ ప్రాతిపదికన మారుతున్న విపత్తులతోనైనా పర్యావరణాన్ని బాగు చేసుకునేందుకు తగిన నిర్ణయం తీసుకోవాలని పేర్కొన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
9912220378
9912220379